క్లుప్తంగా

వరాహ, నరసింహ అవతారాల్లో జగన్నాథస్వామి



గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న జగన్నాథుడు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు గురువారం స్వామివారిని వరాహ, నరసింహ అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో అర్చకులు ఆర్.పార్థసారథి, పి.రవికుమార్, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు జరిపించారు. ధూపదీప నైవేద్యాలతో స్వామివారికి పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

రేషన్‌లో ఒక్క బియ్యమేనా?



పి.రంజిత్ కుమార్

పార్వతీపురం టౌన్: రేషన్ అంటే ఒక్క బియ్యమేనా? అని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ ప్రశ్నించారు. ఈమేరకు గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో రేషన్ సరుకుల కోత ఏమిటని ప్రశ్నించారు. పంచదార లేదు, కందిపప్పు లేదు. ఇదేనా పేదలకు ఇచ్చే రేషన్ సరుకులు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 20వ వార్డులో కేవలం బియ్యం మాత్రమే ఇచ్చారని, పేదల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తంచేశారు. రేషన్ ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమలు, బంగాళాదుంపలు లాంటివి పేదలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు



పెదపెంకి బస్టాండ్‌లో గోతులతో ఉన్న రోడ్డును బాగుచేస్తున్న యువత

బలిజిపేట: మండలంలోని పెదపెంకి బస్టాండ్‌లో రోడ్డుపై ప్రమాదకరమైన గుంత ఉండడంతో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు తన సొంత నిధులతో, కూరాకుల వీధి యువత శ్రమదానంతో మరమ్మతులు చేశారు. బస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, రాత్రివేళ ద్విచక్ర వాహన చోదకులు బోల్తా పడుతున్న విషయం తెలుసుకున్న సంజీవనాయుడు రోడ్డు మరమ్మతులకు రూ.3వేలు వెచ్చించారు. యువత మరమ్మతు పనులకు శ్రమదానం చేయడంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.కృష్ణ, తాతబాబు, గౌరీనాథ్, చిన్న, కె.ఈశు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు



ప్రత్యేక స్టాల్స్‌ను ప్రారంభించిన డీఎస్‌ఓ శివప్రసాద్

పార్వతీపురంటౌన్: నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి కందిపప్పు, సన్న బియ్యం విక్రయాలు చేపట్టినట్లు డీఎస్ఓ శివ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో పలు చోట్ల ప్రత్యేక కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్లో కందిపప్పు కిలో రూ.181 ఉందని, సామాన్య పేద ప్రజలకు తక్కువ ధరకు అందించాలని ఉద్దేశంతో ప్రత్యేక స్టాల్‌లో కిలో రూ.160కి కందిపప్పు అందిస్తున్నామన్నారు. అలాగే బీపీటీ రకం బియ్యం కిలో రూ.55 ఉండగా ప్రభుత్వపరంగా రూ.49కే అందజేస్తున్నామని చెప్పారు. బీపీటీ సోనామసూరి బియ్యం 52.40కి అందించనున్నట్లు తెలిపారు. రైతు బజార్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కిశోర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మామిడిపల్లి, గంగన్నదొరవలస, జీగిరాం గ్రామాలలో ఉన్న విద్యుత్‌లైన్ల మరమ్మతులు, విద్యుత్ తీగలకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపట్టనున్నామని ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి విద్యార్థికీ ‘తల్లికి వందనం’ ఇవ్వాలి

- స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు
- సూపర్‌సిక్స్ మేనిఫెస్టోలో టీడీపీ కూటమి హామీ
- నేడు ఒక్కరికేన్న ప్రకటనతో విస్తుపోతున్న తల్లిదండ్రులు

సాలూరు: మీ బిడ్డలను పాఠశాలకు పంపించండి. ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నాయకులు ప్రతి సమావేశంలో ప్రకటించారు. కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోలో స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని పేర్కొన్నారు. ఈ ప్రకారం ఓ ఇంటిలో ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్తే ఇద్దరికి ఏడాదికి రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45,000 అలా ఇవ్వాల్సి ఉంది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబునాయుడు తనదైన శైలిలో మళ్లీ ప్రజలను మోసం చేసినట్లు తాజాగా ‘తల్లికి వందనం’పై చేసిన ప్రకటనతో స్పష్టమైంది. నాడు ప్రతి విద్యార్థికి ఇస్తానని నేడు ఒక్క విద్యార్థికి తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తానని ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తరువాత దాని ఊసే లేకుండా మోసం చేశారని నాటి చంద్రబాబు మోసాల చిట్టాలను గుర్తుచేసుకుంటున్నారు.



కూటమి ఎన్నికల మేనిఫెస్టో

ముఖ్యమంత్రి దయచూపాలి



నాకు ముగ్గురు పిల్లలు. పెదపాప డిగ్రీ చదువుతుండగా, రెండవపాప ములక్కాయవలస మోడల్‌పాఠశాలలో 8వతరగతి చదువుతోంది. బాబు మక్కువలోని ప్రైవేట్ పాఠశాలలో 5వతరగతి చదువుతున్నాడు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తోంది. ఫీజులు కట్టమని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అడుగుతోంది. తల్లికి వందనం పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముగ్గురు పిల్లలకు ఇస్తామన్న రూ.45,000 బ్యాంక్ ఖాతాలో జమచేస్తే ఫీజులు కట్టుకునేందుకు అవకాశముంటుంది. దయతలచి మమ్మల్ని ఆదుకోవాలి.

–సొండి అనసూయ, మక్కువ గ్రామం

ప్రైవేట్ పాఠశాలల పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి



మా ఇద్దరు పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అమ్మ ఒడి ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన మా పిల్లల్లో ఒకరికి అమ్మ ఒడి నగదు అందించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ద్వారా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని మేనిఫెస్టో సూపర్‌సిక్స్‌లో పేర్కొంది. కావున మా ఇద్దరు పిల్లలకు ఈ పథకం కింద ఏడాదికి రూ.30 వేలు ఈ ప్రభుత్వం అందిస్తుందని ఆశిస్తున్నాం.

–పిట్టా పుష్పలత, గొల్లవీధి, సాలూరు

తల్లికి వందనం వస్తుందని ఆశతో ఉన్నాను



నాకు ఇద్దరు పిల్లలు పాప అపర్ణ 9వ తరగతి, బాబు భరత్ 5 వ తరగతి చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథ కం కింద ఇద్దరి పిల్లలకు రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు ఇస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాను. ఈ పథకానికి సంబంధించి ఇంతవరకు పాఠశాలలో ఎలాంటి సమాచారం మాకు అడగలేదు.

–ముగడ సత్యవతి, తోణాం గ్రామం సాలూరు మండలం

తల్లికి వందనం డబ్బులిస్తే సంతోషం



నాకు ఇద్దరు ఆడపిల్లలు. మక్కువలోని ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దపాప శిరీష ఎనిమిదవ తరగతి, చిన్నపాప మీనాక్షి 5వతరగతి చదువుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా రూ.15వేల చొప్పున అందజేస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని తల్లికి వందనం డబ్బులు ముగ్గురు పిల్లలకు రూ.45,000 అందిస్తారని ఎదురుచూస్తున్నాం.

–మక్కువ దుర్గ, మక్కువ గ్రామం

తల్లికి వందనం ఎలా ఇస్తారు?

ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి తల్లికి వందనం కింద ఒకొక్కరికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికలముందు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటైంది కానీ నేటికీ దానికి సంబంధించిన మార్గదర్శకాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారికే ఇస్తారా? ప్రైవేట్ పాఠశాలల్లో చదివేవారికి కూడా ఇస్తారా? అన్నది ఇంతవరకు చెప్పలేదు. ఈ పథకాన్ని త్వరగా అమలుచేస్తే బాగుంటుంది.

–ఎ.వరలక్ష్మి, పి.చాకరాపల్లి, బలిజిపేట మండలం

20 వరకు డిగ్రీ ప్రవేశాలకు అవకాశం

పార్వతీపురం టౌన్: ఈనెల 20 వరకు డిగ్రీ ప్రవేశాలకు అవకాశం ఉందని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 20 వరకు ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. 23 నుంచి 27 వరకు వెబ్‌ఆప్షన్లు, వాటిలో మార్పులు చేసుకోవడానికి 27వ తేదీన అవకాశం ఉంటుందన్నారు. 31న తొలి దశ సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: బొలెరో వాహనం ఢీకొనడంతో నాటు బండిని తోలుతున్న వ్యక్తికి, ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలంలోని కోటిపాం గ్రామానికి చెందిన పప్పల కోటేశ్వరరావు బుధవారం రాత్రి కోటిపాంలో ఇసుక లోడు నాటుబండిపై వేసి కోటిపాం నుంచి పార్వతీపురం వెళ్తుండగా మార్గమధ్యంలో సోమినాయుడు వలస గ్రామం వద్ద బొలెరో వాహనం వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ఎడ్ల బండిపై నుంచి తుళ్లిపడడంతో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎడ్ల బండి కుడి పక్క ఉన్న ఎద్దుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సుంకరి వెంకటరమణ 108కు సమాచారం అందించి బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బలిజిపేట: పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఉంటుందని బలిజిపేట పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య అన్నారు. ఈ మేరకు పరిశుభ్రతపై మండలంలోని వెంగళరాయపురం పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత అంటే ఏమిటి? చేతులను ఏ విధంగా పరిశుభ్రం చేసుకోవాలి? భోజనం ముందు ఎందుకు చేతులను పరిశుభ్రం చేసుకోవాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు ప్రసాద్, పీహెచ్ఎన్ చంద్రావతి, కార్యదర్శి పోలినాయుడు, అంగన్వాడీలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



వెంగళరాయపురంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

విద్యార్థుల సామర్థ్యం పెంచాలి

బలిజిపేట: విద్యార్థులలో సామర్థ్యం పెంపొందించడం వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతుందని ఎంఈఓ–1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చిలకలపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థులచేత చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యం పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. ప్రతి విద్యార్థిపై పరిశీలనతో దృష్టి పెట్టడం వల్ల వారిలో శ్రద్ధ పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, షూస్ అందే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

పారిశుద్ధ్యం స్పెషల్‌డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా పరిసరాల పరిశుభ్రత కోసం ఈనెల 16 నుంచి ఆగస్టు 2 వరకూ నిర్వహించనున్న పారిశుద్ధ్య పనుల స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈఓ పీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని మార్గదర్శకాలు విడుదలయ్యాయని ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, వెలుగు ఏపీఎం శ్రీరాములు, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాను, ఎంఈఓ జి.సూరిదేముడు, ఐసీడీఎస్ పీఓ సురేఖ, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

కూటమి ఇసుక విధానంతో కష్టాలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను

సాలూరు రూరల్: ఇసుక టన్ను రూ.600కు అమ్మేందుకు కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేయడం వల్ల పేదలు ఇల్లు నిర్మించుకోవడానికి మరింత భారం పడుతుందని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్ దండి శ్రీను మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సాలూరు మండలంలో ఉచితంగానే ఇసుక పంపిణీ జరిగిందని కేవలం అద్దెడబ్బులే లబ్ధిదారులు చెల్లించేవారన్నారు. సాలూరు మండలంలో మామిడిపల్లి, శివరాంపురం, నెలిపర్తి, దుగ్ధసాగరం, కందులపదం గ్రామాలలో ఇసుక తవ్వకాలు జరిగేవని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుకవిధానంలో తొలినాళ్లలో ట్రాక్టర్ ఇసుక (మూడు టన్నులు) 1125 రూపాయలకు సచివాలయంలో చలానా తీసేవారని నాటు బళ్లకు ఉచితంగా ఇసుక ఇచ్చేవారన్నారు. అయితే పేదలు ఇల్లు నిర్మాణం చేసుకోడానికి ఆ చలానా కూడా కట్టలేమని పలువురు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను కోరగా పేదల ఇళ్లకు ఉచితంగానే ఇసుక అందజేసినట్లు తెలిపారు. ఇప్పుడు బొబ్బిలి ఇసుక రీచ్‌లో ఇసుక కొనుగోలు చేసి సాలూరు చేరాలంటే ట్రాక్టర్ అద్దెతో కలిపి 4 వేల రూపాయలు పడుతుందని ఇది పేదలకు చాలా ఎక్కువ భారమవుతుందన్నారు.

లక్ష్మీ నృసింహస్వామికి పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామివారికి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

బలిజిపేట: ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అజ్జాడ ఉన్నత పాఠశాలకు చెందిన చింతా మేఘన, పెదపెంకి ఉన్నత పాఠశాలకు చెందిన టి.అఖిలకు నూజివీడులో, ఉమామహేశ్వరికి శ్రీకాకుళంలో సీట్లు వచ్చాయి. ఆ ముగ్గురు విద్యార్థినులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఐఐఐటీకి సాలూరు విద్యార్థిని

సాలూరు: పట్టణంలోని గాడివీధి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థిని కొట్యాడ హారిక ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని పాఠశాల హెచ్ఎం శ్రీధర్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు హారిక ఎంపికైనట్లు హెచ్ఎం పేర్కొన్నారు.



అఖిల



మేఘన



ఉమామహేశ్వరి



హారిక

జనాభా నియంత్రణకు అవగాహన అవసరం

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్

పార్వతీపురంటౌన్: జనాభా నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా వైద్యారోగ్య అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం, ఇద్దరు పిల్లలు ఇంటికి ముద్దు అనే నినాదాలతో పట్టణంలో చైతన్య ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మన దేశం ఒకటన్నారు. విపరీత జనాభా పెరుగుదల వల్ల సహజ వనరులు అంతరించి అనర్థాలకు దారితీస్తుందన్నారు. సుస్థిర అభివృద్ధి, కుటుంబ నియంత్రణ, పేదరికం కోసం సాధారణ ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. మాతాశిశువుల శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డబిడ్డకు మధ్య అంతరం ఉండేలా అవగాహన కల్పించే విధంగా వైద్యసిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమని దీని ప్రభావం ఆర్థికాభివృద్ధిపై స్పష్టంగా పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం కుటుంబ నియంత్రణకు కృషి చేసిన వైద్యసిబ్బందికి ప్రథమ, ద్వితీయ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వాగ్దేవి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డి.శివకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ఎం.నారాయణ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జగన్‌మోహన్ రావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.వినోద్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, ఎన్‌జీఓ అధ్యక్షుడు జి.ఎస్.కిశోర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్

ఘనంగా జనాభా దినోత్సవం

సీతానగరం: మండలంలోని ప్రజల ఆరోగ్యభద్రతకు పరిసరాలు పరిశుభ్రగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సీహెచ్‌సీ డాక్టర్ నిహారిక అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యసిబ్బందితో కలిసి ఆమె మండల కేంద్రంలోని పురవీధుల్లో ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారిక మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధి నిరోధక వ్యాక్సిన్స్ సకాలంలో వేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రాధాన్యం ఇచ్చామని తెలియజేశారు. వైద్యసిబ్బంది పర్యవేక్షణలో ప్రజలకు మెరుగైన సేవలందించనున్నామని, గ్రామాల్లో ఆశ వర్కర్ల సహకారం తీసుకుని ఉచితవైద్యశిబిరాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు భవాని, సత్యవతి, శర్మ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య,ఏఎన్‌ఎంలు స్వర్ణ, సింహాచలం,హెల్త్ అసిస్టెంట్‌లు కె.నారాయణరావు, శ్రీనివాసరావు, హరికృష్ణ ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: జనాభా దినోత్సవ ర్యాలీచేస్తున్న డాక్టర్ నిహారిక, సూపరువైజర్లు

బలిజిపేటలో మానవహారం

బలిజిపేట: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం బలిజిపేటలో వైద్యశాఖ అధ్వర్యంలో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలను నిర్వహించారు. వైద్యాధికారిణి కిరణ్మయి ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా నియంత్రణ పద్ధతులు పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఎంఈఓ 1 సామల సింహాచలం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



బలిజిపేట: బస్టాండ్‌లో మానవహారంగా రూపొందిన అధికారులు, విద్యార్థులు

మున్సిపాలిటీలో ఆశీల వేలం

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘం కార్యాలయంలో గురువారం ఆశీల వేలం పాట నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. రోజువారీ మార్కెట్ రోడ్డు మార్జిన్, కబేళాల్లో ఆశీలు వసూలు చేసుకునే కాంట్రాక్ట్ హక్కు పొందేందుకు వేలం నిర్వహించామన్నారు. బూరాడ ప్రసన్న, బుడితి శ్రీనివాసరావులు వేలం పాటలో పాల్గొన్నారని, ఈ పాటను నిర్దేశించింది రూ.1,67,760 కాగా పాట మొత్తం రూ.14,35,760కు పాడారని చెప్పారు. 8 ఆగస్టు 2024 నుంచి 31 మార్చి 2025 వరకు 8 నెలలకు గాను ఆశీల వసూలుకు పాటను ఖాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ రూబెన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కనకారావు, జూనియర్ అకౌంటెంట్ అశోక్, ఆర్ఐలు నారాయణరావు, వినయ్, ఎ1 పుష్పలత, ఎ2 శైలజ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

పాడిదిగుబడికి తగుపాళ్లలో పశుగ్రాసం

- పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ దీనకుమార్

సీతానగరం: పాడిపశువులకు అందించే పశుగ్రాసంపై అధిక పాడి దిగుబడి ఆధారపడి ఉంటుందని, రైతులు పశుగ్రాసంపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందని పశుసంవర్ధక శాఖ సీతానగరం ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆయన సీతానగరానికి చెందిన అభ్యుదయ పాడిరైతు డి.రవీంద్రబాబు పొలంలో అధిక పాడి దిగుబడికి అవసరమైన పోషక విలువలున్న పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14వ తేదీవరకూ పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నా మని తెలిపారు. కార్యక్రమంలో పెదభోగిలి, చినభోగిలి, జోగింపేట గ్రామాల పాడి రైతులు, పశువైద్య సహాయకులు జానకి, జానకిరాం, శిరీష, డి.ప్రహ్లాద్, ఎం.శంకరరావు, వి.గుంపస్వామి పాల్గొన్నారు. అలాగే సూరంపేటలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు గ్రామానికి చెందిన దామోదరరావు పొలంలో రైతులకు అవగాహన కల్పించారు.



సీతానగరం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్




లచ్చిరాజుపేట గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ భోగి చక్రధర్

పశుగ్రాసం ఎంతో అవసరం

బలిజిపేట: పశుపోషణకు పశుగ్రాసం ఎంతో అవసరమని బలిజిపేట మండల పశువైద్యాధికారి గణేష్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా గురువారం ఆయన మండలంలోని బర్లి గ్రామంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

పార్వతీపురంటౌన్: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్నామని పశువైద్యాధికారి డాక్టర్ భోగి చక్రధర్ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని లచ్చిరాజుపేట గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు పశుగ్రాసాల వినియోగాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పశుగ్రాసం వినియోగం వల్ల పాడి పశువుల్లో పాల ఉత్పత్తులు పెరిగి ఆర్థిక భరోసా కలుగుతుందని చెప్పారు. పశుగ్రాస విత్తనాలను పాడి రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు.



బలిజిపేట: బల్లిలో పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి గణేష్